

హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు, దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు

## తెలంగాణకు శాపం కాంగ్రెస్సే..

- రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది కేసీఆరే..
- మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు
- తెలంగాణ అభివృద్ధికి పునరంకితమవుదాం
- మళ్లీ మొదలైన ఆత్మహత్యలు, ఆకలి కేకలు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేడుకులు



జనగామలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మహబూబాబాద్ రూరల్ : జాతీయ జెండా ఎగురవేస్తున్న అధ్యక్షురాలు కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



డోర్నకల్ : జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

హనుమకొండ, జూన్ 2 : నాడు, నేడు తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే శాపమని రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి, పదేళ్ల పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదట జాతిపిత మహాత్మాగాంధీ ఫొటోకు పూలమాల వేసిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. అలాగే పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి, తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫొటోలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను దాస్యం వినయ్‌భాస్కర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల ప్రజల పోరాటం, అమరవీరుల బలిదానాలు, బీఆర్ఎస్ పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందన్నారు. నాడు, నేడు కాంగ్రెస్ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రం 18 నెలల కాంగ్రెస్ పాలనలో ఆగమైందన్నారు. దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి పునరంకితమవుదామన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ నాటి స్మృతులను ఉద్యమకారులందరూ మరోసారి నెమరు వేసుకుంటున్నారని అన్నారు. 14 ఏళ్ల క్రితం కేసీఆర్ ఒక్కడిగా మొదలై కోట్లాది మంది ప్రజలను పోగుచేసి స్వరాష్ట్ర కలను సాకారం చేశారన్నారు. కేసీఆర్ పాలనలో విద్య, వైద్య విప్లవంతో పాటు దండుగన్న వ్యవసాయం పండుగలా మారిందన్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని, మళ్లీ కేసీఆర్‌ని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ ఆగమవుతున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 18 నెలలుగా అమలు చేసిన పాపాన పోలేదని, మళ్లీ తెలంగాణలో ఆత్మహత్యల ఆకలి కేకలు మొదలయ్యాయని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, ఇమ్మడి లోహిత, స్వరూపారాణి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు జానకి రాములు, పోలపల్లి రామ్మూర్తి, దూలం వెంకన్న, రఘు తదితరులు పాల్గొన్నారు. కాగా, మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత జాతీయ జెండా ఆవిష్కరించగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పాల్గొన్నారు. అలాగే వరంగల్, డోర్నకల్‌లో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, డీఎస్ రెడ్యానాయక్, జనగామ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాల్గొని జెండాలు ఆవిష్కరించారు.



వరంగల్‌లో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్లు, నాయకులు

# పండుగలా ఆవిర్భావం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

- ఆయా జిల్లా కేంద్రాల్లో అధికారికంగా కార్యక్రమాలు
- ముఖ్య అతిథులతో జెండావిష్కరణ
- అమర వీరులకు శ్రద్ధాంజలి
- వారి కుటుంబ సభ్యులకు సన్మానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- వాడవాడలా త్రివర్ణ పతాకాల ఎగురవేత

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని** సోమవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా జిల్లా కేంద్రాల్లో అధికారికంగా జరిగిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథులు జెండాలను ఆవిష్కరించారు. ముందుగా తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండలో మంత్రి కొండా సురేఖ, ములుగులో మంత్రి సీతక్క, జయశంకర్ భూపాలపల్లిలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, మహబూబాబాద్, జనగామలో ప్రభుత్వ విప్‌లు రాంచంద్రూనాయక్, బీర్ల అయిలయ్య త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, స్వాతంత్ర్య సమర యోధులను సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. విధి నిర్వహణలో ఉత్తమంగా పనిచేసిన పోలీసులకు మెడల్స్ అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ ప్రజా, కార్మిక సంఘాలు, పార్టీలు వాడవాడలా జాతీయ జెండాలను ఎగురవేశారు. అమర వీరులను స్మరించుకొని, వారికి శ్రద్ధాంజలి ఘటించారు.

- నమస్తే నెట్‌వర్క్, జూన్ 2



వరంగల్ కోటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద



హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండాకు వందనం చేస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్



మహబూబాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



హనుమకొండ, వరంగల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మహబూబాబాద్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు



హనుమకొండలో గౌరవ వందనం సమర్పిస్తున్న మహిళా పోలీసులు



జనగామ చౌరస్తా : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కడియం, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

## గంగారంలో కారు బీభత్సం

- ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు వ్యక్తుల దుర్మరణం, ముగ్గురికి తీవ్ర గాయాలు



బాలయ్య(ఫైల్)



మధునమ్మ (ఫైల్)

కాటారం, జూన్ 2: కాటారం మండలంలోని గంగారం గ్రామంలో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చి అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు ఇంటి ముందు కూర్చొని ఉన్న వారిని ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారపాక మధునమ్మ (80), నీలాల బాలయ్య (65), నీలాల మల్లయ్య, వీరి మనుమడు డానియేల్ ఇంటి ముందు ఆవరణలో కూర్చొని ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు వ్యక్తులు కాళేశ్వరం వెళ్లి తిరుగు ప్రయాణంలో గంగారం క్రాస్ వైపు అతివేగంగా వస్తూ అదుపు తప్పి రోడ్డు దిగి ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లింది. దీంతో మధునమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో బాలయ్యను భూపాలపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. డానియేల్, మల్లయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. కాటారం సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అప్పటివరకు కళ్లెదుటే ఉన్నవారిని మృత్యువు రూపంలో కారు కబళించడంతో కుటుంబ సభ్యులు చేసిన రోదనలు కంట తడి పెట్టించాయి. కాగా, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ విషయం తెలుసుకొని గంగారానికి వచ్చి ప్రమాద స్థలాన్ని పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు స్పందించక పోవడంతో ఎస్పీ కిరణ్ ఖరేకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయపడిన వారిని పరామర్శించారు. అనంతరం ఇటీవల కాళేశ్వరం పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తూ అస్వస్థతకు గురై మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

## బాలుడిని రక్షించబోయి..

ప్రమాదవశాత్తు చిన్నారితో సహా వ్యక్తి మృతి



సురేందర్ (ఫైల్)



హర్షవర్ధన్ (ఫైల్)

నడికూడ, జూన్ 2 : చెరువులో పడిన బాలుడిని రక్షించబోయిన వ్యక్తి చిన్నారితో పాటు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని రాయపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. పరకాల పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాయపర్తి గ్రామానికి చెందిన కూనారపు సురేందర్ (45) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం తన ఇద్దరు కుమారులతో కలిసి చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీర్ల రాజమౌళి కుమారుడు హర్షవర్ధన్ (12) చెరువులో ఆడుతూ లోతు ఉన్న చోటుకు వెళ్లి మునిగిపోతున్నాడు. ఈ క్రమంలో సురేందర్ బాలుడిని రక్షించడానికి వెళ్లగా ఈత రాని హర్షవర్ధన్ భయంతో గట్టిగా పట్టుకోవడంతో అతడు కూడా నీటిలో మునిగిపోయాడు. గట్టుమీద ఉన్న సురేందర్ పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని చెరువులోకి దిగి అప్పటికే మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను బయటికి తీశారు. ఎస్సై రమేశ్‌నాయక్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పంచనామా చేసి పోస్టుమార్టానికి పంపించారు.

## ఐటీడీఏలో ఆ శాఖలు కనుమరుగు?

- వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో ఏండ్లుగా భర్తీకి నోచని పోస్టులు
- అధునాతన సాగు పద్ధతుల్లో గిరిజనులకు శిక్షణ అందని ద్రాక్షే?
- ఇప్పటికీ మూస పద్ధతిలోనే వ్యవసాయం, నష్టపోతున్న రైతులు
- పోడు భూముల్లో పంటలసాగుపై సర్వే ఏదీ?



ఏటూరునాగారం, జూన్ 2 : వ్యవసాయ రంగంలో గిరిజనులను తీర్చిదిద్దాల్సిన ఐటీడీఏలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ కనుమరుగయ్యాయి. ఈ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు ఏండ్ల తరబడి భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో గిరిజనులు అధునాతన వ్యవసాయాన్ని అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా గిరిజనులు సుమారు రూ.2 లక్షల ఎకరాల సాగు భూమిని కలిగి ఉన్నట్లు తెలుస్తున్నది. వ్యవసాయంతో పాటు పండ్ల తోటల సాగులో గిరిజనులకు మెళకువలు నేర్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో ఐటీడీఏ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నదని గిరిజనులు వాపోతున్నారు. ఐటీడీఏలో ప్రాజెక్టు వ్యవసాయ శాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారి, విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖలో ప్రాజెక్టు హార్టికల్చర్, హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులు ఏండ్లుగా భర్తీకి నోచుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో గిరిజనులు మిర్చి, పత్తి, వరి, మక్కజొన్న, జొన్న, వేరుశనగ, కందులు, మినుములు, పెసర ఇతర అంతర పంటలను సొంతంగానే సాగు చేస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో ఎక్కువగా మిర్చి సాగు చేస్తున్నారు. అయితే, పంటల అధిక దిగుబడి, చీడ, పీడ, పురుగుల నివారణ పంటల సాగులో మెళకువలు నేర్పించాల్సిన అధికారులు క్షేత్రస్థాయి సందర్శనలు చేయకపోవడంతో గిరిజనులు అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవడంలేదు. భూసార పరీక్షలు, కొత్త వంగడాల సాగుపై అవగాహన, స్టడీటూర్లు, పంటలను విక్రయించేందుకు మార్కెట్లు లేకపోవడంతో గిరిజనులు సాగురంగంలో రాణించలేకపోతున్నారు. ఇదిలా ఉండగా ఐటీడీఏలోని ఉద్యాన శాఖ ద్వారా మామిడి, జామ, జాక్ ఫ్రూట్, పనస, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి, కూరగాయలు సాగు చేసే అవకాశం ఉన్నా సంబంధిత శాఖ అవగాహన కల్పించడం లేదు. దీంతో గిరిజనులు ఇప్పటికీ మూస పద్ధతిలోనే పంటలు సాగు చేసి నష్టమో, లాభమో చేతులు దులుపుకుంటున్నారు.

### హక్కు పత్రాలు సరే.. సాగుపై సర్వే ఏదీ ?

గిరిజనులు సాగు చేసుకున్న పోడు భూములకు ప్రభుత్వాలు హక్కు పత్రాలను అందజేశాయి. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 48,491 మంది రైతులకు 1,29,779ఎకరాలకు సంబంధించి హక్కు పత్రాలిచ్చారు. అయితే ఈ భూములు ఏ పంటలకు అనుకూలమో ఇప్పటివరకు అధికారులు సర్వే చేసి తేల్చలేదు. దీంతో ఏ పంట వేయాలో తెలియక గిరిజన రైతులు ఏదో ఒక పంట సాగు చేయడమో.., లేక బీడుగా ఉంచడమో చేస్తున్నారు. కనీసం రైతులకు ఏం విత్తనాలు తీసుకోవాలనే విషయం కూడా చెప్పడం లేదు. పంటల సాగుకు ఇటీవల కాలంలో అనేక రకాల ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.. వాటి సమాచారం కూడా అధికారులు రైతులకు అందించడం లేదు. వాటి వాడకంపై అవగాహన కల్పించడం లేదు. దీంతో ఏండ్లుగా గిరిజన రైతులు మూస పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి గిరిజన రైతులకు తగిన శిక్షణ ఇస్తే సాగు రంగంలో రారాజులయ్యే అవకాశం ఉంది.



పొలం దున్నుతున్న రైతు

## కాంగ్రెస్ గద్దెపై జాతీయ జెండా

- ఆవిష్కరించిన పార్టీ శ్రేణులు
- నాయకుల తీరుపై ప్రజల విస్మయం



కురవి, జూన్ 2 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీ గద్దెపై జాతీయ జెండాను ఎగురవేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. దేశ గౌరవాన్ని సూచించే గొప్ప ప్రతీకగా జాతీయ జెండా నిలుస్తుంది. దానిని ఎక్కడ, ఎలా ఎగురవేయాలో నిర్దిష్ట నిబంధనలున్నాయి. అయితే పార్టీ గద్దెపై జాతీయ జెండాను ఎగురవేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.


## అధికారుల నిర్లక్ష్యం..

శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి పేరు

పాలకుర్తి, జూన్ 2: జనగామ జిల్లా పాలకుర్తిలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఆది నుంచి వివాదాస్పదంగానే మారుతున్నది. సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలో అధికారుల నిర్లక్ష్యంతో శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్యే అలుగుబెల్లి నర్సిరెడ్డి పేరు ఉండడం విమర్శలకు తావిస్తున్నది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సాక్షిగా అధికారులు ప్రొటోకాల్ తప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డా.. పింగిలి శ్రీపాల్‌రెడ్డా.. అంటూ ప్రశ్నిస్తున్నారు. పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసినా అధికారులు శిలాఫలకంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి పేరు పెట్టడంపై ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు మండిపడుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ప్రైవేట్ వ్యక్తి కాంగ్రెస్ నాయకుడు విగ్రహదాత అంటూ ఎలా పేరు పెడుతారని బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.







శిలాఫలకంలో మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పేరు